క్లుప్తంగా

సాహిత్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వెంకన్న



పాలకుర్తి టౌన్ : మండలంలోని మల్లంపల్లి గ్రామానికి చెందిన జిలుకర వెంకన్నను తెలుగు–వెలుగు జాతీయ సాహిత్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు మంగళవారం ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. కవిగా, రచయితగా సమాజానికి సేవలు అందిస్తున్న వెంకన్న నియామకం పట్ల కవులు, రచయితలు హర్షం వ్యక్తం చేశారు.

నేడు మంత్రి ఎర్రబెల్లి రాక

కొడకండ్ల : నేడు (బుధవారం) రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మండలానికి రానున్నట్లు బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సింధె రామోజీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని పద్మశాలీ మార్కండేయ భవనంలో ఉదయం 9.30 గంటలకు నిర్వహించనున్న రైతు సన్నాహక సమావేశానికి మంత్రి ఎర్రబెల్లి ముఖ్యఅతిథిగా హాజరౌతారని పేర్కొన్నారు. మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు, పార్టీకి, అనుబంధ సంఘాలకు చెందిన నాయకులు హాజరు కావాలని కోరారు.

ఆదేశాలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు


లింగాలఘణపురం : బీఆర్‌ఎస్ ఆదేశాలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బస్వగాని శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యే రాజయ్య ఆదేశాల మేరకు శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంపీపీ చిట్ల జయశ్రీ, మండల అధ్యక్షుడి ఆధ్వర్యంలో నిర్వహిస్తారని పేర్కొన్నారు. కార్యకర్తలు ఎవరైనా ఆదేశాలను ధిక్కరిస్తే పార్టీపరంగా క్రమశిక్షణ చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

21న మహాసభను విజయవంతం చేయండి



చిల్పూరు : ఈనెల 21న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న మాదిగల విశ్వరూప సమాయత్త మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి రడపాక ఆదాము కోరారు. సమాయత్త సభ కోసం మండలంలోని నష్కల్ గ్రామంలో ఆ పార్టీ గ్రామ కమిటీని మంగళవారం ప్రకటించారు. అధ్యక్షుడుగా పాశం అభిషేక్, ఉపాధ్యక్షులుగా అరూరి సిద్దు, దాసు, ప్రధాన కార్యదర్శిగా చాగంటి రాకేష్, కోశాధికారిగా జయాకర్, సహాయ కార్యదర్శిగా బన్ని, సలహాదారుగా సంజీవ, గౌరవ అధ్యక్షుడుగా పాశం రాజు, సభ్యులుగా దానేలు, దాసు, కనుకయ్య, అంజనేయులు, వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు.

విశ్రాంత హెచ్‌ఎం మృతి


సిద్దేశ్వర్‌రావు (ఫైల్)

రఘునాథపల్లి : మండలంలోని కంచనపల్లి గ్రామానికి చెందిన విశ్రాంత హెచ్‌ఎం రంగరాజు సిద్దేశ్వర్ రావు (78) అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. ఆయన కొన్నేళ్లుగా జనగామలో నివాసం ఉంటున్నాడు. కంచనపల్లికి చెందిన పలువురు జనగామలో ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. సిద్దేశ్వర్‌రావు కంచనపల్లి, గబ్బెట, లింగాలఘణపురం మండలంలోని చీటూరు ప్రభుత్వ పాఠశాలల్లో సుదీర్ఘ కాలం పాటు ఉపాధ్యాయుడిగా సేవలు అందించారు. మృతుడికి ముగ్గురు పిల్లలున్నారు.

అంత్యక్రియలకు ఆర్యవైశ్య సంఘం సాయం



జనగామ : రైలులో తినుబండారాలు అమ్ముకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న యువకుడు ప్రమాదానికి గురై మృతి చెందగా అతడి అంత్యక్రియల కోసం ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు సాయం అందించారు. వివరాలిలా.. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రానికి చెందిన కాపర్తి మురళీ (42) కొంత కాలంగా రైళ్లలో తినుబండారాలు అమ్ముకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మురళీ రెండ్రోజుల క్రితం రఘునాథపల్లి రైల్వేస్టేషన్ పరిధిలో ప్రమాదవశాత్తు మృతి చెందాడు. గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసిన జీఆర్పీ పోలీసులు శవాన్ని జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని పోస్టుమార్టం గదిలో భద్రపర్చారు. అనంతరం మృతుడి వివరాలు సేకరించి బాధిత కుటుంబానికి సమాచారం అందించారు. దహన సంస్కారాల కోసం ఆర్థిక ఇబ్బందులుండడంతో రైల్వే పోలీసులు జనగామ పట్టణ ఆర్యవైశ్య సంఘం ప్రతినిధుల సాయం కోరారు. స్పందించిన ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు రూ.9 వేలు అందించి ఔదార్యం చాటుకున్నారు.

కాంగ్రెస్‌కు రాజకీయ సమాధి ఖాయం

లింగాలఘణపురం : వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఇవ్వవద్దన్న కాంగ్రెస్‌కు రాజకీయ సమాధి ఖాయమని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. మండలంలోని కుందారం గ్రామంలోని రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ చొరవ తీసుకుని వ్యవసాయానికి ఉచితంగా విద్యుత్ ఇస్తుండగా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మూడు గంటల విద్యుత్ సరిపోతుందని వ్యాఖ్యలు చేయడం రాజకీయ స్వార్థానికి నిదర్శనమన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలోనూ ఉచిత విద్యుత్ అందించడం లేదని చెప్పారు. రైతుల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ తీసుకుంటున్న చొరవను కాంగ్రెస్ నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో ఎంపీపీ జయశ్రీ, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ఎంపీటీసీ సిద్దు, పీఏసీఎస్ చైర్మన్ శ్రీశైలం, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మధు, రాజు తదితరులు పాల్గొన్నారు.


జఫర్‌గఢ్ : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజయ్య

జఫర్‌గఢ్ : మండలంలోని కూనూర్‌లోని రైతు వేదికలో నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే రాజయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రైతులకు మూడు గంటల విద్యుత్ సరిపోతుందని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అనడం సిగ్గుచేటన్నారు. రైతులకు రేవంత్‌రెడ్డి బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. రైతును రాజును చేయాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ ముందుకు సాగుతున్నట్టు తెలిపారు. ఉచిత విద్యుత్ విషయంలో కాంగ్రెస్‌ది వ్యాపార ధోరణి కాగా సీఎం కేసీఆర్‌ది మానవీయ కోణమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రడపాక సుదర్శన్, మార్కెట్ కమిటీ చైర్మన్ గుజ్జరి రాజు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, నాయకుడు పసునూరి మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమ్మేళన సభలు విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న దయాకర్, సుందర్‌రామిరెడ్డి

దేవరుప్పుల : వ్యవసాయ రంగ అభివృద్ధే ధ్యేయంగా చేపట్టిన సంక్షేమ పథకాలు, భవిష్యత్ ప్రణాళికల రూపకల్పన కోసం ఈనెల 21న మండల కేంద్రంలో, కోలుకొండలో తలపెట్టిన రైతు సమ్మేళన సభలను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తీగల దయాకర్, సమన్వయ కర్త పల్ల సుందర్‌రామిరెడ్డి కోరారు. మండలంలోని కోలుకొండ, తదితర గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన సన్నాహక సమావేశాల్లో వారు మాట్లాడారు. సీఎం కేసీఆర్ రైతు పక్షపాతిగా వ్యవహరిస్తూ వ్యవసాయ రంగంలో తెలంగాణ దేశంలోనే అగ్రగామిగా ఉండేలా తోడ్పాటు అందిస్తున్నారని చెప్పారు. సభలకు మంత్రి దయాకర్‌రావు రానున్న క్రమంలో రైతులు అధిక సంఖ్యలో తరలివచ్చేలా నాయకులు, కార్యకర్తలు చొరవ చూపాలని కోరారు. సమావేశంలో మాజీ ఎంపీపీ కొల్లూరు సోమన్న, జిల్లా యువజన నాయకుడు కోతి ప్రవీణ్, సర్పంచ్ కూర్నాల రవి, రైతుబంధు కోఆర్డినేటర్ కోతి పద్మ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోనగిరి యాకస్వామి, మాజీ డైరెక్టర్ ఖాసీమ్, నాయకులు కమ్మగాని నాగన్న, రామ్మూర్తి, మాచర్ల బాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సర్పంచ్‌తో పాటు మరొకరికి గాయాలు


కారు నుంచి బయటకు వస్తున్న సర్పంచ్ గణపతి

లింగాలఘణపురం : మండలంలోని నెల్లుట్ల బ్రిడ్జి వద్ద కారు ప్రమాదానికి గురి కాగా అందులో ప్రయాణిస్తున్న సర్పంచ్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు దూసరి గణపతితోపాటు బీఆర్‌ఎస్ యూత్ నాయకుడు వట్టిపల్లి సంపత్ స్వల్ప గాయాల పాలయ్యారు. జనగామ నుంచి నేలపోగుల వైపు మంగళవారం రాత్రి గణపతితోపాటు సంపత్ ప్రయాణిస్తున్న కారు ఒక్కసారిగా అదుపు తప్పి నెల్లుట్ల బ్రిడ్జి ఎక్కే ప్రాంతంలోని డివైడర్‌ను ఢీకొట్టింది. కారు ఒకవైపు లేచి నిలబడింది. అందులో ఉన్న గణపతి, సంపత్ స్వల్ప గాయాలతో కారులోంచి బయటకు రావడంతో స్థానికులు ఊపరి పీల్చుకున్నారు.

పేదరాలి వైద్యానికి ఎల్‌ఓసీ అందజేత


ఎల్‌ఓసీ అందిస్తున్న కిరణ్‌కుమార్

బచ్చన్నపేట : మండలంలోని దబ్బగుంటపల్లి గ్రామానికి చెందిన పేదరాలు లింగాల బుచ్చమ్మ బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతుండగా ఆమెకు వైద్యం కోసం సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ.2.50 లక్షల లెటర్ ఆఫ్ కాన్సెంట్ (ఎల్‌ఓసీ)ని బీఆర్‌ఎస్ నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్‌గౌడ్ మంగళవారం అందించారు. అనంతరం కిరణ్‌కుమార్ మాట్లాడారు. పేద కుటుంబానికి చెందిన బుచ్చమ్మ ఆస్పత్రి పాలుకాగా వైద్యం కోసం మంత్రి తన్నీరు హరీష్‌రావుతో మాట్లాడి ఎల్‌ఓసీ ఇప్పించినట్టు తెలిపారు. పేదలకు నిత్యం అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్‌గౌడ్, ఆంజనేయులు, సంపత్, ఇజ్రాయల్, సోమయ్య, నర్సయ్య, సత్తయ్య, రాజిరెడ్డి, యాదగిరి, ఉదయ్, వేణు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

నెల్సన్ మండేలా జయంతి వేడుకలు



జనగామ రూరల్ : జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌజ్ వద్ద సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ ఆధ్వర్యంలో దక్షిణ ఆఫ్రికా మాజీ అధ్యక్షుడు నెల్సన్ మండేలా 105వ జయంతి వేడుకలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండేలా చిత్రపటానికి హ్యూమన్ రైట్స్ జిల్లా చైర్మన్ అరుణ్‌కుమార్, జిల్లా డైరెక్టర్ ఎడ్ల శ్రీనివాస్ పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. మండేలాను నేటి సమాజానికి స్ఫూర్తిప్రదాతగా అభివర్ణించారు. జాతి వివక్షపై అలుపెరుగని ఉద్యమాలు చేశారని కొనియాడారు. మండేలా స్ఫూర్తిని కొనసాగించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ ప్రతినిధులు తిరుపతి, బి.రాజు, డి.నవ్య, ఉమాపతి, సురేష్, భీమా, లలిత తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిపై మంత్రి ఎర్రబెల్లికి వినతి


లింగాల ఘణపురం : మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న సర్పంచ్ స్వరూపరాణి భూపాల్‌రెడ్డి


దేవరుప్పుల : మంత్రి ఎర్రబెల్లికి పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

లింగాలఘణపురం : మండలంలోని నెల్లుట్ల గ్రామాభివృద్ధిపై మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు నెల్లుట్ల సర్పంచ్ చిట్ల స్వరూపరాణి భూపాల్‌రెడ్డి మంగళవారం వినతిపత్రం అందజేశారు. మంత్రిని సర్పంచ్ హనుమకొండలోని సర్క్యూట్ గెస్ట్‌హౌజ్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి సానుకూలంగా స్పందించారని విలేకరులకు సర్పంచ్ వెల్లడించారు. ఆమె వెంట వార్డు సభ్యులు నర్సింహ్ములు, రాజు తదితరులున్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల శుభాకాంక్షలు

దేవరుప్పుల : మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు బీఆర్‌ఎస్ పార్టీ మండల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. తానా సభలను ముగించుకొని స్వదేశానికి వచ్చిన సందర్భంగా ఆయన్ను నాయకులు హనుమకొండలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ ఈదునూరి నర్సింహారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు ఏల సుందర్ ఉన్నారు.

సిబ్బంది నిర్లక్ష్యంతో విద్యార్థులకు ఇబ్బంది

చిల్పూరు : తహసీల్ కార్యాలయ సిబ్బంది నిర్లక్ష్యంతో కుల, నివాస, ఆదాయ, ఇతర ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని సీపీఎం మండల కార్యదర్శి సాదం రమేష్ తెలిపారు. మండల కేంద్రంలో విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడారు. వివిధ గ్రామాలకు చెందిన విద్యార్థులు ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకుని రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదని చెప్పారు. దరఖాస్తులు దొరకడం లేదంటూ సిబ్బంది మళ్లీ దరఖాస్తు చేసుకోమంటున్నారని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు, సిబ్బంది స్పందించి విద్యార్థుల దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించి ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు తప్పవని పేర్కొన్నారు.

'సీపీఎస్'ను రద్దు చేయాలి

పాలకుర్తి : ప్రభుత్వ ఉద్యోగులకు నష్టదాయకంగా పరిణమించిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని యూటీఎఫ్ మండల శాఖ ప్రభుత్వాన్ని ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈనెల 19న తలపెట్టిన బైక్ యాత్రను విజయవంతం చేయాలని ఉపాధ్యాయలను ఫెడరేషన్ శాఖ కోరింది.

రూ.లక్ష రుణమాఫీ చేయాలని వినతి


ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జనగామ : ఇచ్చిన హామీ మేరకు రైతులకు వెంటనే లక్ష రూపాయల రుణమాఫీ చేయాలని, ఫసల్ బీమా యోజనను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ పరిపాలన అధికారి (ఏఓ) మన్సూరీకి మంగళవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉడుగుల రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి సౌడ రమేష్, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొట్ల శ్రీనివాస్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సరికొండ విజయ్‌భాస్కర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు పులిగిల్ల చంద్రయ్య, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు ప్రజ్ఞాపూర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ రికార్డుల తనిఖీ



రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ

బచ్చన్నపేట : ఎంపీడీఓ రఘు రామకృష్ణ గ్రామ పంచాయతీ కార్యాలయాల్లోని రికార్డులను మంగళవారం తనిఖీ చేశారు. తొలుత ఆయన మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. పల్లె ప్రగతి పనులను సందర్శించి పరిశీలించారు. అనంతరం జీపీ రికార్డులను తనిఖీ చేశారు. రికార్డుల్లో జమ, ఖర్చులను తప్పకుండా నమోదు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు స్పష్టం చేశారు. వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లోని మంచినీటి పైపుల లీకేజీలను గుర్తించి ఎప్పటికప్పుడు మరమ్మతు పనులు చేయించాలని చెప్పారు. ఇళ్లల్లోని చెత్తను తడి, పొడిగా వేరు చేసి పంచాయతీ కార్మికులకు అందించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముట్టడికి తరలిన జీపీ సిబ్బంది

లింగాలఘణపురం : స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ ముట్టడికి పంచాయతీ కార్మికులు, సిబ్బంది మంగళవారం తరలివెళ్లారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ జీపీ సిబ్బంది నిరవధిక సమ్మె కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. కార్యక్రమంలో పంచాయతీ జీపీ ఉద్యోగ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు యాకూబ్, ఉపాధ్యక్షుడు మహేందర్, ప్రధాన కార్యదర్శి దరిపల్లి పాండురంగం, నాయకులు కిరణ్, సునీల్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ


విద్యార్థులతో హెచ్‌ఎం ప్రభాకర్

కొడకండ్ల : వరంగల్ వాసవీ క్లబ్ అందించిన నోట్ బుక్స్ మండల కేంద్రంలోని దళిత కాలనీకి చెందిన పేద విద్యార్థులకు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దోర్నం ప్రభాకర్ మంగళవారం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుడు కుసుమ రాజు క్లబ్ ప్రతినిధులను కలిసి కోరిన వెంటనే స్పందించి నోట్ బుక్కులు అందించడం పట్ల వాసవీ క్లబ్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులకు వాసవీ క్లబ్ ప్రతినిధులు రూ.8 వేల విలువైన బుక్కులు అందించడం అభినందనీయమని చెప్పారు.

ఎమ్మెల్యే రాజయ్యకు గుణపాఠం తప్పదు


మాట్లాడుతున్న కొలిపాక సతీష్

స్టేషన్‌ఘన్‌పూర్ : స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్యకు రానున్న ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలు రాజకీయ సమాధి చేసి గుణపాఠం చెప్పక తప్పదని కాంగ్రెస్ పార్టీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొలిపాక సతీష్ అన్నారు. డివిజన్ కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. అభివృద్ధి చేయడం చేతకాకపోగా టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిని, కాంగ్రెస్ పార్టీని విమర్శించడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ పార్టీని రాజకీయ సమాధి చేస్తామని, కాంగ్రెస్ నాయకులను రాళ్లతో కొట్టాలని ఎమ్మెల్యే పిలుపునివ్వడం సమంజసం కాదన్నారు. కాంగ్రెస్ పార్టీ రాజకీయ భిక్షతోనే ఎమ్మెల్యే అయిన విషయాన్ని రాజయ్య విస్మరించవద్దని హితవు పలికారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇవ్వకపోతే బీఆర్‌ఎస్ ఎక్కడుండేదని ప్రశ్నించారు. కాంగ్రెస్‌ను విమర్శించే ముందు ఆత్మవిమర్శ చేసుకోవాలని సూచించారు. రాజయ్య వ్యవహార శైలిని ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. రానున్న రోజుల్లో రాళ్లతో ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డిపై మరోసారి విమర్శలు చేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల నరేందర్‌రెడ్డి, నాయకులు సంపత్‌రెడ్డి, కోల శ్రీనివాస్, కలకోల రఘు, గట్టు యాదగిరి, రాంచందర్, సాంబరాజు తదితరులు పాల్గొన్నారు.

కమిటీని పారదర్శకంగా నిర్వహించాలి


సమావేశంలో మాట్లాడుతున్న మునిగెల రమేష్

జనగామ రూరల్ : జిల్లా మత్స్య పారిశ్రామిక సంఘం కమిటీని రాజకీయ జోక్యం లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని మత్స్య కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మునిగెల రమేష్ కోరారు. జిల్లా కేంద్రంలోని ఆ సంఘ కార్యాలయంలో జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి భిక్షపతి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమావేశంలో రమేష్ మాట్లాడారు. మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడే వారికి అవకాశం కల్పించాలని, ప్రజాస్వామ్యయుతంగా చేపట్టాలని సూచించారు. ఉచితంగా చేప పిల్లల పంపిణీకి బదులు నగదు బదిలీ చేయాలని, మండల కేంద్రాల్లో అధునాతన చేపల మార్కెట్లను ఏర్పాటు చేయాలని, మార్కెట్లో చేపలకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. నగదు బదిలీ అమలు కోసం ఈనెల 24న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయనున్నట్టు తెలిపారు. సమావేశంలో నాయకులు వి రాజు, కె.శ్రీనివాస్, బి.సంజీవులు, రమేష్, రవి పాల్గొన్నారు.

సమర్థవంతంగా పని చేస్తేనే గుర్తింపు

- ఆర్డీఓ కృష్ణవేణికి ఘనంగా వీడ్కోలు


ఆర్డీఓ కృష్ణవేణిని సన్మానిస్తున్న ఉద్యోగులు

స్టేషన్‌ఘన్‌పూర్ : ప్రభుత్వ ఉద్యోగిగా సమర్థవంతంగా పని చేస్తేనే గుర్తింపు లభిస్తుందని ఆర్డీఓ కృష్ణవేణి స్పష్టం చేశారు. ఆమె నర్సంపేట డివిజన్‌కు బదిలీ కాగా స్టేషన్ ఘన్‌పూర్ రెవెన్యూ ఉద్యోగులు మంగళవారం ఆమెకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆమెను తహసీల్, ఆర్డీఓ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయాల ఉద్యోగులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు బాధ్యతగా పని చేయాలని సూచించారు. విధి నిర్వహణలో తనకు సహకరించారంటూ ఉద్యోగులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ పూల్‌సింగ్ చౌహాన్, ఆర్‌ఐ అర్జున్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ సాధించే వరకు ఉద్యమాలు


మాట్లాడుతున్న దర్శనాల రవి

రఘునాథపల్లి : ఎస్సీ వర్గీకరణ సాధించుకునే వరకు ఉద్యమాలు తప్పవని మహాజన సోషలిస్ట్ పార్టీ (ఎంఎస్పీ) మండల ఇన్‌చార్జ్ దర్శనాల రవి చెప్పారు. మండల కేంద్రంలోని ఏఎస్‌ఆర్ ఫంక్షన్ హాలులో సుంచు సురేందర్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమావేశానికి రవి హాజరై మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చేస్తామంటూ హామీ ఇచ్చిన కేంద్రంలోని బీజేపీ మోసపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. వర్గీకరణ సాధన కోసం నిర్వహిస్తున్న పోరాటాల్లో భాగంగా ఈనెల 21న జిల్లా కేంద్రంలో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల జిల్లా సదస్సు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆ సదస్సుకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి మాదిగ, ఉపకులాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. వర్గీకరణ పోరాటం అంతిమ దశకు చేరిందని చెప్పారు. పాలక పక్షాలపై ఒత్తిడి పెంచేందుకు మంద కృష్ణ ఆధ్వర్యంలో ఆగస్టులో హైదరాబాద్‌లో మాదిగల విశ్వరూప మహాసభ జరుగనుందని తెలిపారు. సమావేశంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి కుమార్, ఎంఎస్పీ జిల్లా నాయకులు రంగు శ్రీనివాస్ గౌడ్, రఫీ, మచ్చ అబ్బయ్య, తాళ్లపల్లి ఎల్లయ్య, బైరపాక నర్సింగరావు, కడారి శ్రీకాంత్, ఎంగలి నాగేష్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

కమిటీకి చైర్‌పర్సన్ అభినందన


కార్యవర్గాన్ని సత్కరిస్తున్న చైర్‌పర్సన్ జమున

జనగామ : మున్సిపల్ డ్రైవర్స్ యూనియన్ కమిటీని చైర్‌పర్సన్ పోకల జమున లింగయ్య మంగళవారం అభినందించారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడుగా పానుగంటి ప్రవీణ్‌కుమార్, అధ్యక్షుడుగా మునిగే రవి, ప్రధాన కార్యదర్శిగా మసి రాజు, ఉపాధ్యక్షుడుగా కె.నాగరాజు, కోశాధికారిగా బాషపాక ప్రేమ్, సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌గా సుధాకర్, ముఖ్యసలహాదార్లుగా తిప్పారపు రవి, గురపోయిన రమేష్, కార్యనిర్వాహక అధ్యక్షుడుగా సునబోయిన ఆంజనేయులు ఎన్నికవగా వారిని చైర్‌పర్సన్ సత్కరించారు. అనంతరం కమిటీ కార్యవర్గం మున్సిపల్ కమిషనర్ రజితను మర్యాదపూర్వకంగా కలిసింది. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, నరేశ్, పానుగంటి మల్లయ్య, మహేందర్ యాదవ్, చిన్న, బొట్ల నాగరాజు పాల్గొన్నారు.

నత్తనడకన కల్వర్టు నిర్మాణ పనులు


లారీని చూపిస్తున్న ధర్మభిక్షం

జనగామ రూరల్ : జనగామ నుంచి హుస్నాబాద్ వెళ్లే దారిలోని గానుగుపహాడ్ క్రాస్ రోడ్డు వద్ద చేపట్టిన కల్వర్టు నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం వాపోయారు. లోడ్‌తో వెళ్తున్న ఓ లారీ మార్గమధ్యలో మంగళవారం ఇరుక్కుపోగా ఆయన అక్కడకు చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. కల్వరుపనుల్లో జాప్యం జరుగుతుండడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతోందని చెప్పారు. హుస్నాబాద్, నర్మెట్ట, తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు విఫలమైనట్టు తెలిపారు. భారీ వర్షాలు కురిస్తే పనులు సాగడం లేదన్నారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తక్షణమే రోడ్డు మరమ్మతులు పూర్తి చేయాలని, అప్పటివరకు కల్వర్టు వద్ద ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు.